క్లుప్తంగా

ఏజెన్సీ బంద్‌కు యూటీఎఫ్ మద్దతు

పార్వతీపురంటౌన్: గిరిజన ప్రాంతంలో గిరిజనుల హక్కులైన 1/70 అటవీహక్కుల చట్టాన్ని మార్చాలని ఆదివాసీ గిరిజన సంఘాలు చేస్తున్న ఏజెన్సీ బంద్‌కు యూటీఎఫ్ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుఉ టి.రమేష్, కె.భాస్కర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జీఓ నంబర్ 3 రద్దవడం వలన వందేళ్ల వెనక్కు వెళ్లినట్‌లైందని, ఇప్పుడు 1/70 చట్టం రద్దు చేస్తే వారి ఈ బంద్‌కు యూటీఎఫ్ మద్దతు తెలుపుతుందని ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు.

కోడూరు సాయి మాస్టారుకు సత్కారం



సాయి మాస్టారుకు అవార్డు ఇచ్చి, సన్మానిస్తున్న ప్రముఖులు

సాలూరు: విద్యారంగంలో మూడు దశాబ్దాలుగా విశేష సేవలందిస్తున్న వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డా.కోడూరు సాయి శ్రీనివాసరావు మాస్టారును బంగారు నంది అవార్డుతో ప్రముఖులు సత్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాంస్కృతిక సంస్థ తెలుగు కళారత్నాలు సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాజభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జె.జగదీశ్వరరావు బంగారు నంది అవార్డును తనకు అందజేసి సత్కరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయి మాస్టారును పట్టణంలోని ప్రముఖులు రాజ్‌కుమార్, డా.వాడాడ గణేశ్వరరావు, మోహనరావు తదితరులు అభినందించారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



పెదబొండపల్లిలో పగలు వెలుగుతున్న వీధిదీపాలు

పార్వతీపురం రూరల్: పట్టపగలే విద్యుత్ వీధి దీపాలు వెలుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యుత్ దుబారా అవుతోంది. విద్యుత్‌ను పొదుపుగా వాడాలని దుబారా చేయవద్దని నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆశాఖ అధికారులకు మాత్రం ఆ సూక్తులు పట్టనట్లున్నాయి. మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో ఉదయం పది గంటల సమయంలో వీధిలైట్లు నిరంతరాయంగా వెలుగుతూ అందరికీ దర్శనమించాయి. అలాగే పలు విద్యుత్‌స్తంభాల పక్కన చెట్ల కొమ్మలు అల్లుకుంటూ కనిపించాయి. రానున్న వేసవిలో చెట్లకొమ్మలు విద్యుత్ తీగలపై పడితే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఆ శాఖాధికారులు విద్యుత్ దుబారాను అరికట్టడంతో పాటు ప్రమాదాలుసంభవించకుండా విద్యుత్ స్తంభాల పరిసరాల్లో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పార్వతీపురంటౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల మృతులలో ఎక్కువమంది మద్యం తాగి వాహనాలు నడిపిన వారే ఉన్నారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు విధిగా బండి పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ చలానాలు, రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివాటిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా డ్రంక్‌అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి..

సీతంపేట: ప్రతి రైతుకూ ఆధార్‌కార్డు తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని.. వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య తప్పనిసరన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్సు లేదా వన్‌బీ, ఆధార్‌కార్డు జిరాక్సు, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ఉచిత బస్సు ఉత్తిదేనా?

- ఎన్నికల హామీని అమలు చేయని కూటమి సర్కారు
- నియోజకవర్గంలో మహిళల ఎదురుచూపులు

పార్వతీపురం టౌన్:

మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఎదురు చూస్తున్నా కూటమి ప్రభుత్వం మాత్రం ఆ ఊసే లేకుండా పాలన చేస్తున్న పరిస్థితిని మహిళాలోకం తీవ్రంగా విమర్శిస్తోంది. ఎన్నికల హామీలు సూపర్‌సిక్స్‌లో భాగంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితమంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు ఊదరగొట్టారని, నేడు ఉచిత బస్సు అమలు చేసే విధంగా అడుగులు వేయడం లేదని విమర్శిస్తున్నారు. ఇచ్చిన మాటను అమలు చేయనప్పుడు హామీ ఇవ్వడం ఎందుకని మహిళలు నిలదీసే పరిస్థితి తలెత్తింది. ఆర్టీసీ ప్రయాణం ఉచితం చేస్తామన్నారు కదా అని ఓట్లేశామని, తీరా గెలిచిన తర్వాత ఉచిత బస్సు పథకం గురించి మాటైనా మాట్లాడడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పండగల ముందు ప్రచారం

అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల వేళ కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్నా ఉచిత బస్సుపై ఏం మాట్లాడడం లేదని మహిళలు వాపోతున్నారు.



పార్వతీపురం ఆర్టీసీ డిపోలో బస్సులు

పార్వతీపురం నియోజకవర్గంలో మహిళల వివరాలు

మండలం	పార్వతీపురం	సీతానగరం	బలిజిపేట	మొత్తం
మహిళలు	46,146	23,671	25,371	95,188

పండగలు వస్తున్నాయంటే ఉగాది నుంచి, దసరా, సంక్రాంతి అంటూ తెరపైకి తెస్తారు. మంత్రివర్గంలో కూడా దీనిపై చర్చించామంటూ ప్రచారం చేస్తారు. రోజులు గడచిపోతున్నా హామీని మాత్రం అమలు చేయడం లేదు. పార్వతీపురం నియోజికవర్గంలోని 3 మండలాల నుంచి ప్రజలు రోజూ ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఉచిత బస్సు పథకం అమలు చేయలేదంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకు పడుతున్నారు. నలుగురు మహిళలు కలిస్తే ఉచిత బస్సు, ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం వంటి పథకాలపై చర్చ చేసుకుంటూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు అందుబాటులోకి తీసుకు రాలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన తల్ వందనం, ఉచిత బస్సు పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

– మజ్జి శోభారాణి, ఎంపీపీ పార్వతీపురం

ఎన్నికల ప్రచారానికే పరిమితం



మహిళలను ఆకర్షించేందుకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పథకం గురించి మాట్లాడకపోవడం దారుణం. మహిళలకు హామీ ఇచ్చిన ప్రకారం ఉచిత బస్సు పథకాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలి.

– బోను గౌరీశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్, పార్వతీపురం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి



ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అయితే హామీ ఇప్పటి వరకూ అమలు చేయలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని అమలు చేశాయి. ఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేస్తే మహిళలకు కొంత మేరకు ఊరట కలుగుతుంది. ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

–బలగ రమణమ్మ, ఎంపీపీ, సీతానగరం

'డీ వార్మింగ్' డేను విజయవంతం చేయాలి

సీతానగరం: జాతీయ 'డీ వార్మింగ్' డే కార్యక్రమాన్ని సోమవారం వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఉష, డాక్టర్ పి.పావని కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో వైద్యాధికారులు ఆదివారం మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని పాఠశాలలు అంగన్వాడీ, వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వైద్యసిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల వయస్సును అనుసరించి వేయనున్నామన్నారు. ఈ మేరకు పిల్లల తల్లిదండ్రులు అన్ని పాఠశాలల్లో తమపిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్‌బెన్డ్ జోల్–400 రకం మాత్రలు వేయించాలని కోరారు.విద్యార్థులు మాత్రలు మింగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అందుకు ప్రజలు ఉపాధ్యాయులకు, వైద్యసిబ్బందికి సహకరించాలని కోరారు.

రెండు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు సిద్ధం

సీతానగరం: మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జోగింపేట స్కూల్‌ఆఫ్‌ఎక్స్‌లెన్స్(గిరిజన ప్రతిభా విద్యాలయం)ప్రిన్సిపాల్స్ ఎల్.దాలినాయుడు, ధర్మరాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరు సందర్భాల్లో వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు ఉత్తర్వుల మేరకు ఈనెల 17 నుంచి 19 వ తేదీల మధ్య ప్రాక్టికల్స్ నిర్వహించడానికి ల్యాబ్‌లను సిద్ధం చేశామన్నారు. మార్చి 1వ తేదీనుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. జోగింపేట స్కూల్ ఆఫ్ ఎ క్స్‌లెన్స్, సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ల్యాబ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు నిర్దేశించిన సమయానికి హాజరు కావలసిఉంటుందని స్పష్టం చేశారు.

ప్రయాణం–ప్రమాదకరం



చిలకలపల్లి–వంతరాం రహదారిపై వేసిన అపరాల పంట



పదమాయవలస రోడ్డులో వేసిన అపరాల చేను

బలిజిపేట: ఈ సీజన్‌లో రహదారులపై ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. ప్రధాన రహదారులపై వాహనాలపై వెళ్లాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తున్నా పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణంగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. బలిజిపేట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులపైనే పంటలను ఆరబెట్టడం, వాటిని నూర్చడం, గాలికి పోతలు చేయడం వల్ల వాహనాలపై వెళ్లలేకపోతున్నామంటున్నారు. ఇంత సమస్య ఉన్నప్పటికీ పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణంగా ఉందని చెబుతున్నారు. రహదారులపై పంటలను ఆరబెట్టేటప్పుడు వాహనాల రాకపోకలకు దారిలేకుండా పోతోందని వాపోతున్నారు. రోడ్డు పక్కనుంచి అయినా వెళ్దామంటే బెర్ములు లేక వాహనాలు బోల్తా కొట్టి పంటపొలాలలో పడిపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అపరాల పంట చేను రహదారులపై వేయడంతో ద్విచక్రవాహనాలపై వచ్చేవారు వాటిపై నుంచి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీస్‌శాఖవారు పట్టించుకోవాలని కోరుతున్నారు.

రహదారి స్థలంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం

బలిజిపేట: మండలంలోని పదమాయవలసలో సర్వే నంబర్ 64లో ఉన్న రహదారి స్థలంలో ఆలయం, బస్‌షెల్టర్ నిర్మాణానికి సర్పంచ్ టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. బలిజిపేట నుంచి పదమాయవలస వెళ్లే మార్గంలో గ్రామం ప్రారంభంలో సర్వే నంబర్ 64లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉంచాల్సిన అదనపు స్థలం ఉంది. ఆ స్థలంలో బస్‌షెల్టర్, మందిరం నిర్మాణానికి సర్పంచ్ సత్యనారాయణ పంచాయతీ తీర్మానం చేయించారు. నిర్మాణానికి సంబంధించిన చర్యలు చేపడుతున్నారు. దీనిపై అదేగ్రామానికి చెందిన టి.వనజాక్షి బలిజిపేట తహసీల్దార్, పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రహదారి స్థలాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, అదేవిధంగా పక్కనే తన స్థలానికి ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే గతం నుంచి రెవెన్యూ లెక్కల ప్రకారం నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్న స్థలం రహదారిగానే రికార్డుల్లో ఉన్నట్టు దానిని అధికారులు గుర్తించి భవిష్యత్తులో రహదారికి ఇబ్బందులు లేకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. దీనిపై తహసీల్దార్ రత్నకుమారిని వివరణ కోరగా స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎటువంటి పనులు చేపట్టవద్దని సూచించినట్టు చెప్పారు.



పదమాయవలసలో రహదారి స్థలంలో నిర్మాణానికి సిద్ధమవుతున్న ఆలయం

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: 104 ఉద్యోగులు సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని 104ల యూనియన్ అధ్యక్షుడు ఆనందరావు, సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి మన్మథరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని వేంకటేశ్వర కల్యాణ మంటపం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే, జీతంలో వెయ్యి రుపాయిలు కోత పెట్టడం న్యాయం కాదని వాపోయారు. 104లో సీటీసీ విధానాన్ని రద్దుచేసి ఈపీఎఫ్‌లో యాజమాన్యం వాటాను యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, 104 ఉద్యోగులకు గతంలో మాదిరిగా ఫుడ్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేసారు.కార్యక్రమంలో నాయకులు జగదీష్, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో మైనర్లు?

- వ్యసనానికి బానిసవుతున్న యువత
- రవాణా, విక్రయాల్లోనూ వారే..

సాలూరు: గంజాయి, సారాకు యువత బానిసవుతున్నారు. ఇందులో మైనర్లు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పండగలు, పుట్టిన రోజు వేడుకలంటూ..విద్యార్థులు, యువత మత్తులో మునిగి తేలుతున్నారు. మరోవైపు రవాణా, విక్రయాల్లోనూ భాగమవుతున్నారు. తక్కువ కాలంలో అధిక డబ్బు సంపాదించే మార్గంగా ఈ అక్రమ వ్యాపారాలను పలువురు ఎన్నుకుంటున్నారు. పోలీసులు ఇటీవల కాలంలో తరచూ గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలపై దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో వీటి వెనుక సాలూరు, పరిసర ప్రాంతాల్లో బాలురు, యువతే ఉండడం గమనార్హం.

సంపాదనమార్గంగా..?

తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపిస్తూ.. పలువురు అక్రమార్కులు, వ్యాపారులు యువతను గంజాయి, సారా రవాణాకు సాలూరు పరిసర ప్రాంతాల్లో వినియోగిస్తున్నారు. సాలూరు శివారులో కొద్దిరోజుల క్రితం రూరల్ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు నాలుగు కిలోల గంజాయితో సాలూరు పట్టణం వైపు వస్తుండగా.. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అందులో ఒకరు పట్టణానికి చెందిన యువకుడు కాగా.. మరొకరు పాచిపెంట మండలానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. ఇందులో ఒకరు మైనర్‌గా సమాచారం. ఈ తరహా ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వినియోగం, రవాణా, విక్రయాల్లో మైనర్లు, యువత ఎక్కువగా దొరుకుతున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది.

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

గంజాయి కేసుల్లో దొరుకుతున్న మైనర్లు, యువతకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నప్పటికీ..ఫలితం కనిపించడం లేదు. తరచూ పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో పిల్లల తల్లిదండ్రుల సహకారం అవసరమని పోలీసులు చెబుతున్నారు.

ప్రజల సహకారం ఉంటేనే..

గంజాయి, సారా నియంత్రణ విషయంలో పోలీసులకు ప్రజలు సహకరించాలి. ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు గానీ, సమీప పోలీస్‌స్టేషన్‌లో గానీ సమాచారం అందించాలి. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టిసారించాలి. పిల్లలు సన్మార్గంలో నడవడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం.

– రామకృష్ణ, రూరల్ సీఐ, సాలూరు

తేమ ఉన్న భూముల్లో మిశ్రమపంటలు మేలు



ఆకు కూరపంట సాగును పరిశీలిస్తున్న రీజనల్ టెక్నికల్ లీడ్ కె.ప్రకాశ్

సీతానగరం: ఖరీఫ్ వరి పంట కోసిన పొలాల్లో తేమ ఉన్న సమయంలో వేసిన రబీపంటలో మిశ్రమ పంటలు సాగు చేయడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు, భూమిలో కర్బన శాతం పెరిగి భూమి గుల్లబారుతుందని వ్యవసాయశాఖ రీజనల్ టెక్నికల్ లీడ్ కె ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని గుచ్చిమి పంచాయతీ తాన్న సీతారాంపురం గ్రామంలో గల డ్రై సోయింగ్(తేమ కలిగి ఉన్న పొలంలో రబీపంట) వేసిన రైతుల పొలాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యపంటలతో పాటు ఇతర రకాల విత్తనాలు కలిపి వేసుకోవడం వల్ల ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌కు కావాల్సిన విత్తనాలు సమకూర్చుకోచ్చునన్నారు. అదేవిధంగా రసాయన ఎరువు రహితంగా వేసిన ముఖ్యపంటతో పాటు ఆకుకూరలు, కూరగాయలు ఈ విధంగా పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ పి. దేవాప్రసాద్, ఎల్‌టు గంగరాజు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్లు



అధ్వానంగా పార్వతీపురం బైపాస్ రహదారి

- అదుపు తప్పుతున్న వాహనాలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణం నుంచి వీరఘట్టం, పాలకొండ ప్రాంతాలకు వెళ్లే బైపాస్ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహన చోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుంతలు ఏర్పడితే కేవలం మట్టి పోసి మరమ్మతులు మాత్రమే చేపడుతున్నారు. రోడ్డు కంకర తేలిపోవడడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రమాదం అంచున ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఫ్లైఓవర్‌పై ఉన్న రోడ్డు గుంతలమయమైందని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం

పార్వతీపురం పట్టణంలో బైపాస్ రోడ్డుపై కంకర తేలడంతో ఆటోలో గానీ, స్కూటర్‌పై కానీ వెళ్లడం కష్టంగా ఉంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ తూతూమంత్రంగా పనులు చేపట్టారు తప్ప శాశ్వత పరిష్కారానికి అధికారులు ముందుకు రావడం లేదు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– వి.శ్రీనివాసరావు, పార్వతీపురం

మరమ్మతులు చేపట్టాలి

బైపాస్ రహదారిపై వెళ్లడం కష్టంగా ఉంది. రహదారిపై గుంతలు పడితే మట్టి కంకర వేసి తూతూమంత్రంగా పనులు చేపడు తున్నారు. రోడ్డుపై కంకర తేలిపోవడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– కె. వెంకటశ్రీధర్, పార్వతీపురం

ఏజెన్సీ బంద్‌కు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

పార్వతీపురం టౌన్: 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మన్యం జిల్లాలో ఈ నెల 12న నిర్వహించనున్న బంద్‌కు అన్ని వర్గాల వారు సహకరించి జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలోని వర్తక కలాసీల సంఘం భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీ, ప్రచారం, ప్రదర్శనలు, 12న బంద్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ బంద్‌లో పాల్గొని గిరిజనులకు మద్దతు తెలపాలని కోరారు.కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఎం.గోపాలరావు, గిరిజన సంఘం నాయకుడు పాలక రంజిత్‌కుమార్, అఖిల భారత రైతు కూలీసంఘం నాయకుడు బొత్స నర్సింగరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కె.సీతారాం, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆర్. సర్వేశ్వరరావు, సన్నిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ కూడలి వద్ద ఇబ్బందులు

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రధాన రహదారి ఆర్టీసీ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పాడయ్యాయి. పట్టణ ప్రధాన కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ గత 6 నెలలుగా మరమ్మతుల బారిన పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ పాడైనా పట్టించుకునేవారు కరువయ్యారని వాహన చోదకులు, పట్టణవాసులు వాపోతున్నారు. ఈ కారణంగా ప్రమాదాల భయం వెంటాడుతోందని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై వెంటనే పోలీసు అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



మరమ్మతుల బారిన పడిన ట్రాఫిక్ సిగ్నల్ లైట్

విరిగిన విద్యుత్ స్తంభం



పని చేస్తుండగా విరిగిన విద్యుత్ స్తంభం

సీతానగరం: మండలంలోని ఇళ్లకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి వేస్తున్న విద్యుత్ స్తంభాలు వైర్లు వేయకముందే నేలమట్టం కావడంతో స్తంభాల్లో ఎంత నాణ్యత ఉందోనని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిడగల్లు జంక్షన్ నుంచి నీలకంఠాపురం మీదుగా బూర్జ వరకూ రోడ్డును ఆనుకుని విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. ఇప్పటికే బూర్జ వద్ద వైర్లు వేస్తుండగా ఒకే పర్యాయం మూడు స్తంభాలు ఒకే పర్యాయం విరిగిపోయిన సంఘటన మరువక ముందే నీలకంఠాపురం గ్రామంలో విద్యుత్ స్తంభం వేస్తుండగా విరిగి పోవడంతో స్తంభాల్లో నాణ్యత కొరవడిందని సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యుత్ వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాసిరకం స్తంభాలను మార్చు చేసి నాణ్యతా ప్రమాణాలతో కూడిన స్తంభాలు, ముడి సరుకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.